

తలకోన ఈవో మమత బాధ్యతలు స్వీకరణ

ప్రజాశక్తి-యర్రావారిపాలెం

ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ తలకోన సిద్దేశ్వర స్వామి ఆలయ కార్య నిర్వహణ అధికారిగా మమత బుధవారం బాధ్యతలు స్వీకరించారు. తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ ఆలయం, తిరుపతి గ్రూప్ టెంపుల్స్‌లోనూ ఏడాదిపాటు కార్యనిర్వహణ అధికారిగా విధులు నిర్వహించినట్లు తెలిపారు. ప్రస్తుతం తలకోన ఆలయానికి, చంద్రగిరి మూలస్థానమ్మ ఆలయానికి బాధ్యతలు చేపట్టినట్లు తెలిపారు.

జల'గండం'

దొరవారిసత్రంలో నీట మునిగిన నారుమళ్లు

- పొంగుతున్న వాగులు, వంకలు
- గ్రామాలకు తెగిపోయిన రాకపోకలు
- రేణిగుంట విమానాలు చెన్నయ్‌కి మళ్లింపు
- ఘాట్‌లో విరిగిపడిన కొండచరియలు
- నేడూ ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలకు సెలవు
- నేడు శ్రీ వారి మెట్టు నడక మార్గం మూత
- అర్ధరాత్రి తీరం దాటిన వాయుగుండం

బంగాళాఖాతంలో అల్పపీడనం బుధవారం అర్ధరాత్రి సూళ్లూరుపేట వద్ద తీరం దాటనుందని వాతావరణ శాఖ హెచ్చరిస్తోంది. ఈ నేపథ్యంలో సూళ్లూరుపేట, నాయుడుపేట, గూడూరు, మనుబోలు ప్రాంతాల్లో వర్షం ఎక్కువగా నమోదు కానుంది. వాయుగుండం తీరం దాటే సమయంలో వర్షాలు, గాలులు 40 కిలోమీటర్ల నుంచి 50 కిలోమీటర్ల వరకూ ఉండే అవకాశం ఉంది. గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. చిరువ్యాపారులు వ్యాపారాలు లేక బిక్కుబిక్కుమంటూ చలికి వణుకుతూ ఇళ్లల్లోనే ఉంటున్నారు. ఇప్పటికే చెరువులన్నీ నిండిపోవడంతో రెవెన్యూ, పోలీసు సిబ్బంది భద్రతా చర్యలు చేపట్టారు. కొన్ని గ్రామాలకు రాకపోకలు బంద్ చేశారు. గురువారం సైతం ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలకు కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ సెలవు ప్రకటించారు. ఏర్పేడులో 90.8మిల్లీమీటర్ల వర్షపాతం అత్యధికంగా నమోదయ్యింది. అత్యల్పంగా వరదయ్యపాలెంలో 9.6 మిల్లీమీటర్లు నమోదయ్యింది.

ప్రజాశక్తి - తిరుపతి టౌన్, యంత్రాంగం

తిరుపతి నగరంలోని డిఆర్ మహల్ రైల్వే అండర్ బ్రిడ్జి, వెస్ట్‌చర్చి వద్ద ఉన్న అండర్ బ్రిడ్జి వద్ద నీరు ప్రవహిస్తోంది. దీంతో రాకపోకలు ఆగిపోయాయి. కపిలతీర్థం, మాల్వాడిగుండం నుంచి వరద నీరు తిరుపతి నగరంలోకి చేరుతోంది. లోతట్టు ప్రాంతాలు, స్వర్ణముఖి నదీ పరీవాహక ప్రాంతాల్లో పరిస్థితిని ఎప్పటికప్పుడు అధికారులు పరిశీలిస్తున్నారు. లక్ష్మీపురం సర్కిల్ వద్ద మార్గాన్ని మూసేశారు. ఇందిర ప్రియదర్శిని కూరగాయల మార్కెట్‌లో ఫుట్‌పాత్‌పై వ్యాపారం చేసుకునేవారు ఇబ్బందులు పడ్డారు. లోతట్టు ప్రాంతాలను కమిషనర్ ఎన్.మౌర్య బుధవారం పరిశీలించారు. రేణిగుంట మండలంలోని భగత్‌సింగ్, జ్యోతిరావుపూలే కాలనీల్లో మురికినీరు ఇళ్లల్లోకి వచ్చింది. రేణిగుంట మల్లిమడుగు డ్యాం వద్ద వర్షపునీరు ఉధృతంగా చేరుతోంది. దీంతో కరకంబాడి చెరువులో నీటి మట్టం బాగా పెరిగింది.

ముంపు ప్రాంతాల్లో తిరుపతి కమిషనర్ మౌర్య పరిశీలన

రెండో ఘాట్‌లో జారిపడ్డ కొండ రాళ్లు

ప్రజాశక్తి -తిరుమల తిరుమల రెండవ ఘాట్ రోడ్డులో అక్కడక్కడ కొండ రాళ్లు జారి పడ్డాయి. వీటిని ఘాట్ రోడ్డు సిబ్బంది, విజిలెన్స్ అధికారులు తొలగించి ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టారు. దీంతో టిటిడి భద్రతా చర్యలకు ఉపక్రమించింది. ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా సందర్శనీయ ప్రదేశాలైన పాపవినాశనం, శ్రీవారిపాదాల మార్గాలను మూసివేసింది. ఇప్పటికే తిరుమలలో విఐపి బ్రేక్ దర్శనాలను రద్దు చేశారు. తిరుమల గిరుల్లో మాల్వాడిగుండం భారీగా ప్రవహిస్తోంది.

నేడు శ్రీ వారి మెట్టు నడక మార్గం మూత : ఈవో

భారీ వర్షాల కారణంగా వాతావరణ పరిస్థితులు దష్ట్యా తిరుమలకు వెళ్లే శ్రీవారి మెట్టు నడక మార్గాన్ని గురువారం వరకు మూసివేయాలని టీటీడీ నిర్ణయం తీసుకుంది. భారీ నుండి అతి భారీ వర్షాలు పడతాయనే వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో టీటీడీ ఈఓ జె.శ్యామలరావు బుధవారం టీటీడీ ఉన్నతాధికారులతో వర్చువల్ గా సమావేశమయ్యారు. కొండ చరియలపై ప్రత్యేక నిఘా ఉంచి ఘాట్ రోడ్లలో ట్రాఫిక్ జామ్ కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. విద్యుత్ కు అంతరాయం కలగకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో టీటీడీ అడిషనల్ ఈఓ సి. హెచ్.వెంకయ్య చౌదరి, జేఈఓలు గౌతమి, వీరబ్రహ్మం, సీవీఎస్వో శ్రీధర్, సిఈ సత్య నారాయణ పాల్గొన్నారు.

'రన్‌వే'పైకి వర్షపు నీరు

రేణిగుంట : విమానాశ్రయంలో రన్‌వేపైకి నీరు చేరడంతో ల్యాండింగ్ సమస్య తలెత్తి ఇండిగో విమానాన్ని చెన్నయ్‌కి దారి మళ్లించారు. ఈ విమానం హైదరాబాద్ నుంచి రేణిగుంటకు రావాల్సి ఉంది. ట్రూజెట్, ఎయిర్‌ఇండియా, ఇండిగో విమానాలు చెన్నయ్‌కి వెళ్లాయి. దీంతో ప్రయాణికులు ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వచ్చింది. ప్రయాణికులు చెన్నయ్ వెళ్లి మళ్లీ తిరిగి తిరుపతికి రావాల్సి వచ్చింది.

తమిళనాడు, కర్నాటక రైళ్లు రద్దు

ఆంధ్రప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాల్లో అల్పపీడన ప్రభావంతో పలు రైళ్లను రద్దు చేసినట్లు దక్షిణ రైల్వే ఓ ప్రకటనలో తెలిపింది. తిరుపతి- చెన్నై సెంట్రల్ (16203) తిరుపతి ఎక్స్‌ప్రెస్, తిరుపతి- చామరాజనగర్ (16220)కాట్పాడి మీదుగా కర్ణాటక రాష్ట్రానికి వెళ్లే రైళ్లను తాత్కాలికంగా రద్దు చేశారు.

స్వర్ణముఖిలో భారీ వరద ప్రవాహం

ఏర్పేడు : మండలంలో అక్టోబర్ మాసంలో 212.4 మిల్లీమీటర్లకు గాను అక్టోబర్ 13-16 తేదీల్లోనే అత్యధికంగా 240.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయ్యింది. స్వర్ణముఖి నదీ పరీవాహక ప్రాంతాల్లో కొన్ని కుటుంబాలను ముందస్తుగా ఖాళీ చేయించి పునరావాస కేంద్రాలకు తరలించారు. ఇటు కొత్త వీరాపురం, అటు మోదుగులపాలెం వద్ద వాహనాల రాకపోకలను నిషేధించి ముళ్లకంచెలను ఏర్పాటు చేశారు. మునకలపాలెం, గోవిందవరం, గుడిమల్లం సీతకాల్వ వద్ద ముళ్లకంచెలను ఏర్పాటు చేశారు. గుడిమల్లం వద్ద విద్యుత్ స్తంభం కూలింది. చింతలపాలెం ఎస్టీ కాలనీలో తొమ్మిది కుటుంబాల వారిని తహశీల్దార్ భార్గవి, ఎంపిడిఒ సౌభాగ్యమ్మ పునరావాస కేంద్రమైన ప్రాథమిక పాఠశాలకు తరలించారు.

నీట మునిగిన నారుమడులు

దొరవారిసత్రం : ఏకొల్లు, సిగనాలత్తూరు, తొగరాముడి, వెదురుపట్టు పంచాయతీల్లో నారుమడులు నీట మునిగాయి. చల్లిన వరి విత్తనాలు నీట మునిగి ప్రవాహంలో కొట్టుకుపోయాయని రైతులు లబోదిబోమంటున్నారు. సింగనాలత్తూరు గ్రామంలో చెరువులోకి ప్రవహించే కాల్వలు మరమ్మతు చేయకపోవడంతో వర్షపునీరంతా పంట పొలాలవైపు మళ్లింది. దీంతో వందల ఎకరాల నారుమడులు, పైరు నీట మునిగాయి. పంట నష్టాన్ని అంచనా వేసి నష్టపరిహారం చెల్లించాలని రైతులు కోరుతున్నారు.

వర్షపునీరు తొలగింపు

కోట : మండలంలోని చెందోడు పంచాయతీ (విద్యానగర్)లోని కొత్తపాలెం రోడ్డు వద్ద డ్రైనేజీలో చెత్తాచెదారం చేరి వర్షపునీరు నిల్వ ఉంది. సర్పంచి దేవారెడ్డి మాధవి, వైసిపి సీనియర్ నాయకులు దేవారెడ్డి నాగూర్‌రెడ్డిలు జేసీబీల సాయంతో పూడిక తీయించారు. పీపుల్స్ ప్రొటెక్షన్ ఫౌండేషన్ చైర్మన్ మీజూరు.మల్లి కార్జున్ రావు దాతృత్వంతో బిరియాని పొట్లాలను పునరావాస కేంద్రాల్లో ఉండేవారికి కోట తహసీల్దార్ జయజయ రావు, ఎంపిడిఓ వేణు చేతులు మీదుగా అందజేశారు. గోవిందపల్లిపాలెంకు వెళ్లే దారిలో బ్రిడ్జి వద్ద వర్షపునీరు అధికం అవడంతో వాహనాల రాకపోకలను నిలిపేసినట్లు ఆర్ఐ మధులత తెలిపారు. తుపాను తీవ్రత విషయమై భయపడాల్సిన అవసరం లేదని టిడిపి నాయకులు షేక్ జలీల్ అహ్మద్ భరోసా ఇచ్చారు.

పొంగుతున్న వాగులు, వంకలు

శ్రీకాళహస్తి రూరల్ : శ్రీకాళహస్తి నుంచి ముచ్చువోలు గుండా వెంకటగిరికి వెళ్లే ప్రధాన రహదారి మార్గంలో మంగళపూరి పంచాయతీ ఉడుములపాడు వద్ద ఏరు పొంగి రోడ్డు దాటే పరిస్థితి లేదు. ఎర్రగుడిపాడు పంచాయతీ కత్తిమడుగు కాజ్‌వే వద్ద వాగు దాటకుండా ముళ్లకంచె వేసినట్లు అక్కుర్తి సచివాలయ డిడిఒ లీలావతి తెలిపారు. ఓబులాయిపల్లి కాజ్‌వే వద్ద వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో తహశీల్దార్ లక్ష్మీనారాయణ ఆ ప్రాంతంలో పరిశీలించారు. ఆర్ఐ నల్లయ్య పాల్గొన్నారు. పట్టణంలోని చెంచులక్ష్మి కాలనీలో భారీగా వరదనీరు చేరడంతో ఎంఎల్ఎ బొజ్జల సుధీర్‌రెడ్డి స్వయంగా దగ్గరుండి జేసీబీ సాయంతో నీటిని బయటకు పంపించారు. చెంబేడు, కన్నలి కాల్వల్లో పూడిక తీయించారు.

అరణియార్‌కు గంటకు 1060 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

పిచ్చాటూరు : అరణియార్‌కు వరదనీరు అరుణానది, ఏలం కాల్వల ద్వారా చేరుతోంది. గంటకు 1060 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుంది. బుధవారం సాయంత్రం 3 గంటలకు 20.6 అడుగులకు నీటి మట్టం చేరిందని ఎఇ లోకేశ్వర్‌రెడ్డి తెలిపారు. పూర్తిస్థాయి నీటి మట్టం 31 అడుగులు. నీటి సామర్థ్యం 1.85 టిఎంసి అని తెలిపారు.

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం

నారాయణవనం : సముదాయం గ్రామంలోని అరుణానది వర్షాలకు ఉధృతంగా ప్రవహిస్తోంది. టిటిడి ఆలయాలైన అవనాక్షమ్మ, అగస్త్యేశ్వర ఆలయాలకు, రైతులకు సరఫరా అయ్యే విద్యుత్ స్తంభాలు అరుణానదిలో ఉన్నాయి. నది మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభం కిందకు ఒరిగిపోయింది. అధికారులు చర్యలు తీసుకుని విద్యుత్‌కు అంతరాయం లేకుండా చూడాలని స్థానిక రైతులు కోరుతున్నారు.

గ్రామాలకు రాకపోకలు బంద్

దొరవారిసత్రం : రైల్వే అండర్ బ్రిడ్జిలు వర్షపునీరు చేరడంతో గ్రామాలకు రాకపోకలు స్తంభించాయని ఎస్ఐ అజయ్‌కుమార్ తెలిపారు. మండల పరిధిలోని దొరవారిసత్రం, అక్కర పాకు, పోలిరెడ్డి పాలెం, మేలుపాకు, అయ్యపాలెం, మొదలగు గ్రామాల పరిధిలో ఉన్న రైల్వే అండర్ బ్రిడ్జిలు వర్షపు నీటితో పూర్తిస్థాయిలో నిండిపోగా ఎస్సై అజయ్ కుమార్ స్పందించి అండర్ బ్రిడ్జిలు వద్దకు వెళ్లి బ్రిడ్జిలో చేరిన వర్షపు నీటిని తొలగిస్తూ అటువైపు ఎవరిని పోనీకుండా జాగ్రత్తలు చేపట్టి కానిస్టేబుల్ లను రక్షణగా పెట్టారు.

కల్కి ట్రస్టు అన్నదానం

వరదయ్యపాలెం : నాలుగు రోజులుగా భారీ వర్షాలు కురవడంతో కరుణానది, మల్లమడుగు, పులిబొంద వాగులు నిండుకుండలను తలపిస్తున్నాయి. బుధవారం జరగాల్సిన సర్వసభ్య సమావేశాన్ని వాయిదా వేశారు. బిజిఆర్ గిరిజనకాలనీ, చిన్నవారిపాలెం నీట మునిగాయి. ప్రతి ఏటా సహాయక చర్యలతో సరిపెట్టేస్తారా? అంటూ గ్రామస్తులు అధికారులపై అసహనం వ్యక్తం చేవారు. గిరిజనులను పునరావాస కేంద్రాలకు తరలించారు. కల్కి ట్రస్టు ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. సత్యవేడు సిఐ మురళి ప్రమాదకరంగా ఉన్న ప్రాంతాలను పరిశీలించారు. ఎస్ఐ మల్లికార్జున్‌ను మండల పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు.

అప్రమత్తంగా ఉండాలి : ఎంఎల్ఎ ఆదిమూలం

నాగలాపురం : నియోజకవర్గ ప్రజలు వర్షాలకు అప్రమత్తంగా ఉండాలని ఎంఎల్ఎ కోనేటి ఆదిమూలం సూచించారు. బుధవారం నాగలాపురం మార్కెట్‌యార్డు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. నియోజకవర్గంలోని నారాయణవనం మండలంలోని తుంబూరు, పాలమంగళం, కెవిబిపురం మండలంలోని పూడి సికె కాల్వ, నాగలాపురం మండలం ద్వారకానగర్, ఊత్తుకోట- సత్యవేడు రోడ్డు కాజ్‌వేలు గత నాలుగేళ్లుగా వర్షాలకు కొట్టుకుపోతున్నాయన్నారు.

వాగులు దాటొద్దు : ఎస్ఐ

కెవిబిపురం : బుధ, గురువారాల్లో అతి భారీ వర్షాలు ఉన్నందున గ్రామస్తులు వాగులు వంకలు దాట వద్దని ఎస్ఐ వీరాంజనేయులు తెలిపారు. విద్యుత్ స్తంభాలను ముట్టుకోరాదని సూచించారు. మండలంలోని కోవనూరు పూడి కాళంగి రిజర్వాయర్‌ను ద్వామా పీడీ సివి ప్రసాద్ బుధవారం సుడిగాలి పర్యటన చేశారు. ఇంచార్జ్ తహశీల్దార్ మునిరత్నం, ఎంపీడీవో రాధా రాణి, ఎస్సై వీర ఆంజనేయులు అధికారుల బందం తదితరులు పాల్గొన్నారు

ఆదుకోవాలని విజ్ఞప్తి : సర్పంచి

పుత్తూరు టౌన్ : తడుకు పంచాయతీ ఎగువ గూళూరుకు రాకపోకలు స్తంభించడంతో నీటమునిగిన ప్రాంతాల్లో తక్షణం సహాయ చర్యలు చేపట్టాలని సర్పంచి పాశం వెంకటేష్ అలియాస్ బొబ్బిలి యాదవ్ ఆర్‌డిఒ రామ్మోహన్‌ను కోరారు. రాచపాలెం అండర్‌బ్రిడ్జి వద్ద నీరు చేరడంతో శల్యవైద్యం కోసం వచ్చే రోగులు వెళ్లలేక ఇబ్బందులు పడ్డారు.

మరమ్మతుకు నోచని కల్వర్టు

బిఎన్ కండ్రిగ : ఎన్టీఆర్ నగర్ సమీపంలోని కెటిరోడ్డు కల్వర్టు పోయిన ఏడాది కురిసిన వర్షాలకు కొట్టుకుపోయింది. తాత్కాలిక మరమ్మతులు చేపట్టడంతో ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు కల్వర్టుకు ఇరువైపులా ఉన్న మట్టి కోసుకుపోతోంది. అధికారులు స్పందించి శాశ్వత మరమ్మతులు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పాడుబడ్డ భవనాల్లో ఉండొద్దు : తహశీల్దార్

ఓజిలి : రానున రెండు రోజుల్లో అధిక వర్షపాతం నమోదయ్యే ప్రమాదం ఉందని తహశీల్దార్ పద్మావతి తెలిపారు. శిథిలావస్థలో ఉన్న, పాడుబడిన భవనాల్లో ప్రజలు ఉండరాదని సూచించారు. ప్రభుత్వ హెల్ప్ లైన్ నెంబర్కు 7396153253 కాల్ చేయాలని తెలియజేశారు.

తుపాను 'ప్రమాద ఘంటికలు'

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి బంగాళాఖాతంలో ఏర్పడ్డ అల్పపీడన ద్రోని ప్రభావంతో తూర్పు మండలాల్లో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. ఎడతెరపి లేకుండా మోస్తారు నుంచి భారీ వర్షాలు కురవడంతో రిజర్వాయర్లు, చెరువులు, వాగులకు వరద నీరు చేరుతోంది. శ్రీకాళహస్తి ఆర్డిఒ భాను ప్రకాష్ రెడ్డి అన్ని శాఖల సమన్వయంతో తుపాను ముప్పు ప్రాంతాల్లో పర్యటించి సహాయక చర్యలు చేపట్టారు. అరణియార్, కాళంగి రిజర్వాయర్లకు భారీగా భారీగా వరద నీరు చేరుతున్నడంతో జలకళ సంతరించుకుంటున్నాయి. అదేవిధంగా మైనర్, మేజర్ చెరువులకు నీరు చేరుతుండడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. దాదాపు 50 శాతం మేర చెరువుల్లో నీటి నిల్వలు చేరినట్లు ఇరిగేషన్ అధికారులు చెబుతున్నారు.

పూడికతీతతో తప్పిన ముంపు భయం

ప్రజాశక్తి -వెంకటగిరి, డక్కిలి

టిడిపి ప్రభుత్వ హయాంలో కైవల్య నది పూడికతీత , జాతర సందర్భంగా రూ.34 లక్షలతో పట్టణంలోని డ్రైనేజీల పూడికతీత పనులు సమర్థవంతంగా చేపట్టిన కారణంగానే మూడు రోజులుగా వర్షాలు కురుస్తున్నా వెంకటగిరికి ముంపు భయం తప్పిందని స్థానిక ఎమ్మెల్యే కురుగొండ్ల రామకష్ణ తెలియజేశారు. బుధవారం ఆయన పట్టణంలోని సవారిగుంట ,ధర్మపురం , చింతచెట్టు సెంటర్ వంటి లోతట్టు ప్రాంతాలను అధికారులతో కలిసి పరిశీలించారు. సవారీ గుంట ప్రాంతంలో నివాసాల్లోకి నీరు చేరుతున్నందువలన మోటార్లు ఏర్పాటు చేసి నీటిని తొలగింపు చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో శ్రీరామదాసు గంగాధర్ , సానిటరీ ఇన్స్పెక్టర్ రామారావు, సీఐ రమణ పాల్గొన్నారు.

అందుబాటులో పునరావాస కేంద్రాలు

నాయుడుపేట : ముంపు ప్రాంతాలకు అందుబాటులో పునరావాస కేంద్రాలు ఉనానయని డిప్యూటీ తహశీల్దార్ ఎ.రాజేంద్ర తెలిపారు. మూడు రోజలుగా లోతట్టు ప్రాంతాలను పరిశీలిస్తున్నట్లు తెలిపారు. లోతట్టు ప్రాంతాలైన పండ్లూరు లోని మావిడి కాలవ, వేడుగల వారధి, మేనకూరు, పుదూరు, పుడేరు, కలిపేడు, కాపులూరు గ్రామాలలోని వరద తీవ్రతను పరిశీలించారు. వి ఆర్ ఓ మురళీధర్, వి ఆర్ ఏ లు దివ్య భారతి, మునిరాజా ఉన్నారు.

ఇళ్లనుంచి బయటకు రావద్దు : సబ్‌కలెక్టర రాఘవేంద్ర మీనా

గూడూరు టౌన్ : తుపాను ప్రభావం గూడూరు డివిజన్‌లో ఎక్కువగా ఉంటుందని, ఎంతో అత్యవసరమైతే తప్పితే ప్రజలు ఇళ్లనుంచి బయటకు రావద్దని సబ్‌కలెక్టర్ రాఘవేంద్ర మీనా చెప్పారు. తీరు ప్రాంత మండలాల్లో మత్స్యకారులు చేపల వేటకు వెళ్లకుండా చర్యలు చేపట్టినట్లు వివరించారు.

కేబిఆర్ నగర్ వరదనీటికి శాశ్వత పరిష్కారం: ఎమ్మెల్యే నాని

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)



తలకోన ఉగ్రరూపం

ఎన్నో ఏళ్లుగా మంగళం పరిధిలోని తిరుమల నగర్ గ్రామపంచాయతీ కేబిఆర్ నగర్ ప్రాంత ప్రజలు ఎదుర్కొంటున్న వరద నీటి సమస్యకు త్వరలో శాశ్వత పరిష్కారం చూప బోతున్నామని చంద్రగిరి నియోజక వర్గ శాసనసభ్యులు పులివర్తి నాని స్పష్టం చేశారు. లోతట్టు ప్రాంత ప్రజలు 20 మంది సురక్షితంగా తిరుమలనగర్ సచివాలయ సముదాయంలో ఏర్పాటు చేసిన బస కేంద్రంలో ఉన్నారు. బుధవారం ఆయా ప్రాంతాలను ఎంఎల్ఎ పులివర్తి నాని పరిశీలించారు. రూ.34 లక్షల రూపాయలతో కేబీఆర్ నగర్ కు వరద నీరు చేరకుండా కల్వర్టు, కాలువలను నిర్మాణం చేస్తామన్నారు. త్వరలోనే పనులు ప్రారంభించి మూడు నెలల్లో పూర్తి చేస్తామన్నారు. అనంతరం పునరావాస కేంద్రంలో ఉన్న శరణార్థులను పలకరించి వారికి దుప్పట్లను పంపిణీ చేశారు. ఆర్‌డిఒ రామ్మోహన్, ఆర్ఐ జానీబాష, విఆర్ఒ నాగలక్ష్మి, సతీష్, సర్పంచి వకుల, శివశంకర్‌రాజు పాల్గొన్నారు.

అర్ధరాత్రి తీరం దాటనున్న వాయుగుండం

ప్రజాశక్తి - తడ

మండలంలో ఎడగెరపి లేకుండా వర్షం కురుస్తోందని ఎంపిడిఒ విజయ్‌కుమార్ తెలిపారు. అర్ధరాత్రి 12 గంటల నుంచి 3 గంటల ప్రాంతంలో సూళ్లూరుపేట పొన్నేరి మధ్య తీరం దాటే అవకాశం ఉందని, అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ సూచించారని తెలిపారు. వర్షపాతం 132.2 మిమీ నమోదైనట్లు తెలిపారు. హైస్కూల్ లో ఏర్పాటుచేసిన పునరావాస కేంద్రాలను యం యల్ ఏ విజయ శ్రీ తనిఖీ చేసినట్లు తెలిపారు. 109 మందికి భోజన సదుపాయం కల్పించారు. బుధవారం ఏ పి ఐ ఐసి మాంబట్టు సెజ్ లో అపాచి లాంటి కొన్ని కంపెనీలు సెలవు ప్రకటించగా, 1000 మందికి పైగా పని చేస్తున్న భారతీయ కంపెనీ, వాల్కరో, ఈ ప్యాక్, భారత్ ఫోర్జ్ లాంటి కొన్ని కంపెనీలు మాత్రం యధాతధంగా నడిచాయి.

ఎటువంటి రక్షణ చర్యలు లేకుండా చెత్త తొలగిస్తున్న పారిశుధ్య కార్మికులు

'శవంతో సాహసయాత్రలు' ఎన్నాళ్లు..?: సిపిఎం

తిరుపతి టౌన్ : ఆ ఊళ్లో ఎవరు మరణించినా శవంతో సాహసయాత్రలు చేయాల్సిందేనని, అరుణానదిలో ఈదుకుంటూ శవాన్ని తీసుకెళ్లి అంత్యక్రియలు చేయాల్సిందేనని సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు పేర్కొన్నారు. నాగలాపురం మండలం సురుటుపల్లి గ్రామపంచాయతీలోని కస్తూరినాయుడు కండ్రిగ గ్రామంలో నివాసం ఉంటున్న శంకర్ మంగళవారం మృతిచెందితే నదిలోనే పాడె మోసుకుని ఫీట్లు చేసుకుంటూ వెళ్లాల్సి వచ్చిందని తెలిపారు. ఇలాంటి ఘటనలు జిల్లాలో ఎన్ని పునరావృతం అవుతున్నా శాశ్వత పరిష్కారం చూపడంలో ఉన్నతాధికారుల వైఫల్యం కనిపిస్తోందన్నారు. కూటమి హయాంలో శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్‌చేశారు.

అమెరికాలో తిరుపతి జిల్లా వాసులు మృతి

శ్రీకాళహస్తిలో ఇద్దరు, గూడూరులో ఒకరు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

హరితా రెడ్డి(ఫైల్)

అమెరికాలోని రాండాల్ఫ్‌లో సోమవారం సాయంత్రం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో తిరుపతి జిల్లాకు చెందిన ముగ్గురు దుర్మరణం చెందారు. వీరిలో ఇద్దరు శ్రీకాళహస్తి వాసులు కాగా, ఒకరు గూడూరు వాసి. వివరాల్లోకి పోతే తొట్టంబేడు మండలం చిట్టత్తూరు గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు డి.భాస్కర్ రెడ్డి, లత దంపతుల కుమార్తె హరితా రెడ్డిని ఏడాది కిందట శ్రీకాళహస్తి పట్టణం బంగారమ్మ కాలనీకి చెందిన సాయి రెడ్డితో వివాహం జరిపించారు. వీరిరువురూ సాఫ్ట్వేర్ ఉద్యోగులుగా అమెరికాలో స్థిరపడ్డారు. ఈ క్రమంలో సోమవారం టూర్ నిమిత్తం స్నేహితులు గోపి, శివనాయుడులతో కలిసి కారులో వెళ్తుండగా రాండాల్ఫ్ వద్ద కారు ఎదురుగా వస్తున్న మరో వాహనాన్ని ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో కారులో మొత్తం నలుగురు ప్రయాణిస్తుండగా ముగ్గురు అక్కడికక్కడే మృతిచెందారు. మృతి చెందిన వారిలో హరితా రెడ్డి(27), రాజినేని శివనాయుడు(27), తిరుమూరు గోపి(28)లు ఉన్నారు. హరితా రెడ్డి భర్త చెన్ను సాయి రెడ్డి(33)కి తీవ్ర గాయాలు కావడంతో ఆసుపత్రిలో అత్యవసర చికిత్సను అందిస్తున్నారు. రాజినేని శివ నాయుడుది తొట్టంబేడు మండలంలోని చిన్నకనపర్తి కాగా, ఆయన తండ్రి రమేష్ నాయుడు శ్రీకాళహస్తిలో న్యాయవాదిగా పనిచేస్తున్నారు. గోపీది గూడూరు పట్టణం.ఈ విషాద ఘటన తెలియడంతో బంగారమ్మ కాలనీతో పాటు, చిన్నకనపర్తి, గూడూరులో విషాదఛాయలు అలముకున్నాయి. వీరి మృతదేహాలను స్వస్థలానికి తరలించేందుకు బంధువులు సన్నాహాలు చేస్తున్నారు.అమెరికాలో చికిత్స పొందుతున్న సాయిరెడ్డికి మెరుగైన వైద్యం అందించేలా చూడాలని తానా సభ్యులతో ఎంఎల్ఎ బొజ్జల సుధీర్‌రెడ్డి ఫోన్‌లో మాట్లాడారు.

హద్దులు దాటె..మద్యం షాపుల 'అద్దెలు'

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

మద్యం వ్యాపారం బాగా జరిగే ప్రాంతాల్లో 'అద్దెలు' ఆకాశాన్నంటుతున్నాయి. ఐదేళ్ల క్రితం 15-20వేలు పలికిన మద్యం షాపుల అద్దెలు ఒక్కసారిగా నెలకు 80వేల నుంచి లక్షకు చేరుకుంటున్నాయి. కొన్ని ప్రాంతాల్లో అనుకున్నట్లే 16వ తేదీనే మద్యం షాపులు ప్రారంభించగా, కొన్నిచోట్ల సరైన ప్రాంతాలు దొరక్కపోవడంతో ఇప్పటికీ ఏర్పాట్లలోనే నిర్వాహకులు నిమగ్నమై ఉండటం కనిపించింది.

ప్రస్తుతం టిడిపి కూటమి నూతన మద్యం పాలసీని తీసుకొచ్చింది. ఐదేళ్ల క్రితం పాలసీనే తిరిగి అమల్లోకి వచ్చింది. గత ప్రభుత్వం హయాంలో ప్రభుత్వం ఆధీనంలో ఉన్న మద్యం షాపులను ప్రవేట్ వ్యక్తులకు కేటాయించింది. అందుకు తగ్గ టెండర్లను ఈనెల 14వ తేదీన లాటరీ పద్ధతి ద్వారా నిర్ణయించారు. ఇందులో భాగంగా తిరుపతి అర్బన్ ప్రాంతంలో 32 షాపులకు 985 మంది టెండర్లు దాఖలు చేశారు. తిరుపతి రూరల్ ప్రాంతంలో 12 షాపులకు 391 మంది టెండర్లు వేశారు. తిరుపతి అర్బన్ రూరల్ ప్రాంతాల్లో కలిసి 43 షాపులను కేటాయించారు. ఈ షాపులకు టెండర్ల ద్వారా లైసెన్స్ దక్కించుకున్న మద్యం వ్యాపారులు షాపులు ఏర్పాటు చేసేందుకు చర్యలు ప్రారంభించారు. తిరుపతి రూరల్ ప్రాంతంలో ముందుగా ఎంచుకున్న ప్రాంతాల్లో కొంతమంది షెడ్డులు ఏర్పాటు చేసుకున్నారు. తిరుపతి అర్బన్ ప్రాంతంలో మాత్రం రోడ్లకు ఇరువైపులా ఉన్న షాపులు ముందుగానే 20 శాతం మంది రిజర్వ్ చేసుకోగా, మరో 80 శాతం మందికి షాపులు దొరకలేదు. పాఠశాలకు, ఆలయాలకు దూరంగా మద్యం షాపులు ఏర్పాటు చేయాలని నిబంధన ఉండడంతో ఆ మేరకు షాపుల నిర్వాహకులు ప్రయత్నాలు ప్రారంభించారు. అద్దె షాపుల కోసం నగరం మొత్తం గాలింపులు చేపట్టారు. అక్కడక్కడ కొన్ని షాపులు అందుబాటులో ఉన్నా, వాటి అద్దెలను యాజమాన్యులు పది రెట్లు పెంచి చెప్పడంతో వ్యాపారులు విస్తుపోయారు. గతంలో 10వేల నుంచి 18 వేల రూపాయలు లోపు ఉన్న అద్దెలు ప్రస్తుతం పోటీ పెరగడంతో 80వేల నుంచి లక్ష రూపాయలు పెంచడం గమనార్హం. దీంతో 16వ తేదీ నుంచి ప్రారంభం కావాల్సిన మద్యం షాపులు తిరుపతి పట్టణంలో ఏర్పాటు చేయలేకపోయారు. త్వరలోనే అందుబాటులోకి తెచ్చేలా నిర్వాహకులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు.

తెరచిన వెంటనే మూత

వరదయ్యపాలెం : ఆదిలోనే హంసపాదంలా తయారయ్యింది నూతన మద్యం దుకాణాల పరిస్థితి. నూతన మద్యం దుకాణాన్ని బుధవారం మండలంలోని హరిజనవాడ గుడి దగ్గరలో ప్రారంభించారు. ఆగ్రహించిన మహిళలు, గ్రామస్తులు హుటాహుటిన అక్కడకు చేరుకుని దుకాణదారులతో వాగ్వివాదానికి దిగారు. గుడికి, బడికి దూరంగా ఉండాలన్నారు. నిబంధన బేఖాతర్ చేస్తే రిలేదీక్ష చేయడానికి వెనుకాడేది లేదని హెచ్చరించారు. దీంతో దుకాణాన్ని తెరచిన వెంటనే మూత వేయడం గమనార్హం.

మహిళల నిరసన

మా ఊళ్లో లిక్కర్‌షాప్ వద్దు

పుత్తూరు టౌన్ : రాచపాళెం మెయిన్‌రోడ్డు పక్కన ఉన్న లిక్కర్ షాప్ వల్ల తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, అక్కడ షాపు వద్దని బుధవారం 27వ వార్డు ప్రజలు ఎక్సైజ్ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు

ఫల సరుకులు పంపిణీ

ప్రజాశక్తి-గూడూరు టౌన్: పట్టణంలోని డిఎస్‌ఆర్ కమ్యూనిటీ హాల్లో లయన్స్ క్లబ్ ఆఫ్ గూడూరు వైజెపి అధ్వర్యంలో వృద్ధులకు ఫల సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు మనోజ్ కుమార్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సేవా దృక్పథాన్ని అలవర్చుకోవాలన్నారు. ప్రతి నెల క్రమం తప్పకుండా సేవా కార్యక్రమాన్ని చేస్తున్నామన్నారు. క్లబ్ సీనియర్ సభ్యులు ఆర్‌వి రావు మాట్లాడుతూ తుపాను తర్వాత పేదలకు అవసరమైన చోట సహాయ సహకారాలు అందించుటకు సభ్యులందరూ సిద్ధమై ఉండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సభ్యులు సుబ్రహ్మణ్యం యాదవ్, మురళి నాయుడు, గోపీనాథ్ రెడ్డి, సెక్రెటరీ శీను యాదవ్, ట్రెజరర్ పసుపులేటి ప్రసాద్ పాల్గొన్నారు.

'దాతల చేయూత అభినందనీయం'

ప్రజాశక్తి-గూడూరు టౌన్: విపత్తులు సంభవించిన ప్పుడు బాధితులను ఆదుకునేందుకు ప్రభుత్వానికి అండగా పట్టణ పరిధిలోని దాతలు, స్వచ్ఛంద సంస్థలు నిలవడం అభినందనీయమని గూడూరు ఎమ్మెల్యే సునీల్ కుమార్ అన్నారు. రెండో పట్టణ పరిధిలోని శ్రీరామరక్ష కుటీరంలో శ్రీరామరక్ష సేవా సంఘం నాయకులు చిట్టిబాబు సీఎం సహాయనిధికి రూ.25వేల చెక్కును ఎమ్మెల్యేకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దాతలను అభినందించారు. కార్యక్రమంలో సీనియర్ ఆడిటర్ రాంమోహన్ రావు, నాయకులు పులిమి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు రెయిన్ కోట్స్ వితరణ

ప్రజాశక్తి-రామచంద్రాపురం(చంద్రగిరి): గత మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో చంద్రగిరి పంచాయతీలోని పారిశుధ్య కార్మికులకు టీడీపీ మండల అధ్యక్షులు సుబ్రహ్మణ్యం నాయుడు సహకారంతో ఈశ్వర్ ట్రేడర్స్ అధినేత మునిరత్నం రాయల్ రెయిన్ కోట్స్ పంపిణీ చేశారు. చంద్రగిరి పంచాయతీలు పారిశుధ్య కార్మికులు వర్షానికి తడవకుండా పారిశుధ్య పనులు చేయడానికి వీలుగా సర్పంచ్ రూప ఆధ్వర్యంలో 30మందికి రెయిన్ కోట్స్ అందజేశారు. కార్మికులందరూ రెయిన్ కోట్స్ ధరించి తమ విధులు నిర్వహించారు. వర్షాకాలంలో తమ బాధలను గుర్తించి కోట్స్ అందజేసినందుకు ఈశ్వర్ ట్రేడర్స్ అధినేత మునిరత్నం రాయల్‌కి, సర్పంచ్ రూపాకు పారిశుధ్య కార్మికులు కృతజ్ఞతలు తెలిపారు.

జెబి శ్రీనివాస్‌కు పితృ వియోగం

కోటేశ్వర రావు(ఫైల్)

ప్రజాశక్తి-తిరుపతి సిటీ: తిరుపతికి చెందిన టిడిపి నాయకులు జెబి శ్రీనివాస్ తండ్రి ఎం.కోటేశ్వర రావు అనారోగ్యంతో చికిత్స పొందుతూ బుధ వారం మృతి చెందారు. దహన క్రియలు గురు వారం మధ్యాహ్నం 3గంటలకు కరకంబాడీ రోడ్డు గోవిందదామంలో నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. తనపల్లి క్రాస్ వద్దనున్న తబూన్ రెస్టారెంట్ సమీపంలో కెఆర్ నగర్‌లోని శ్రీనివాస్ స్వగృహం శ్రీనివాస నిలయం కోటేశ్వర రావు భౌతికకాయానికి పలు రాజకీయ నాయకులు పార్టీలకతీతంగా, ప్రముఖులు నివాళులర్పించారు. వారి కుటుంబానికి సంతాపాన్ని తెలిపారు.

వరద బాధితులకు ఆర్థిక సాయం



ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: విజయవాడలోని వరద బాధితులకు చిత్తూరు జిల్లాలోని గుడిపాల మండలంలో ఉన్న స్టార్క్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ యాజమాన్యం రూ.లక్ష ఆర్థిక సాయాన్ని అందించింది. ఆర్థిక సాయాన్ని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పోతుగుంట విజయ్ బాబు చేతుల మీదుగా బుధవారం మంత్రి కింజరపు అచ్చం నాయుడుకు విజయవాడలో చెక్కును అందజేశారు.

నిరసన వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు

పల్లె పండుగ మాకెప్పుడు..?

- 15ఏళ్లుగా ఎదురుచూస్తున్నాం..
- సిసి రోడ్డు నిర్మించరే..
- ఎగువాగుకూరులో గ్రామస్తుల నిరసన

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: 'పాలకులు మా పల్లెకెప్పుడొచ్చేరో.. పండుగెప్పుడు చేస్తారో.. 15ఏళ్లుగా ఆఫీసుల చుట్టూ తిరుగుతున్నా.. కాళ్లరుగుతున్నాయే తప్ప పల్లెలో రోడ్డు మాత్రం వేయలేదు. ప్రతి ఐదేళ్లకోసారి ఓటు అడుగుతారు.. వెళతారు.. రోడ్డగితే.. ఊసే ఉండదు..' ఇదీ పుత్తూరు రూరల్ మండలం తడుకు పంచాయతీ ఎగువాగుళూరు దళితవాడ ప్రజల ఆవేదన. ఊళ్లోని వీధుల్లో సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టక ఇబ్బంది పడుతున్నామని, 15ఏళ్లుగా పాలకులు, అధికారుల చుట్టూర తిరుగుతున్నా పట్టించుకున్న పాపాన పోలేదని ఆ గ్రామస్తులు మండిపడ్డారు. బుధవారం దళిత గిరిజన జిల్లా కార్యదర్శి వై నందయ్య ఆధ్వర్యంలో గ్రామంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టాలని గ్రామ సభల్లో, మండల కార్యాలయాల్లో, జిల్లా కలెక్టరేట్‌లోనూ అనేక సార్లు వినతి పత్రం అందించినా ఫలితం లేకపోయిందన్నారు. వర్షమొస్తే ఊరంతా బురదమయమై తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొవాల్సి వస్తోందన్నారు. పాలకులు, అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తాజాగా చేపట్టిన 'పల్లె పండుగ' కార్యక్రమంలోనైనా ఊరికి సీసీరోడ్డు మంజూరు చేసి చర్యలు తీసుకుంటారని ఎదురుచూసినా అలాంటి ఊసే లేకపోవడం శోచనీయం అన్నారు. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి వెంటనే గ్రామానికి సీసీ రోడ్డు నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలని ఆ గ్రామస్తులు వేడుకుంటున్నారు. నిరసన కార్యక్రమంలో వ్యవసాయ కార్మికుల సంఘం మండల అధ్యక్షులు మునికృష్ణ, అంబేద్కర్ సంఘం పుత్తూరు మండల కార్యదర్శి పుష్ప రాజు, గ్రామస్తులు చినపాపమ్మ, బాబు, కౌసల్య, రామయ్య, భాను, కల్యాణయ్య, విశాల్, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

సిమెంటు రోడ్డుకు భూమి పూజ

పిచ్చాటూరులో

ప్రజాశక్తి-సత్యవేడు: మండలంలోని ఏఎం పురం గ్రామంలో బుధవారం 'పల్లె పండుగ' కార్యక్రమాన్ని నిర్వహించారు. సిసి రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేపట్టారు. ఉపాధి హామీ నిధులతో 4చోట్ల సిమెంటు రోడ్డు నిర్మాణం చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు. బుధవారం సర్పంచ్‌లు శిరీషశ్రీనివాసులు రెడ్డి, బుజ్జమ్మ నాదమునిల ఆధ్వర్యంలో భూమి పూజ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు యుగంధర్, ఇంజనీరింగ్ అసిస్టెంట్ హర్ష, ఈశ్వరయ్య, టీడీపీ నాయకులు కోటి మధు, దామోదరం, ఢిల్లీబాబు తదితరులు పాల్గొన్నారు.

పిచ్చాటూరు: పల్లె పండుగలో భాగంగా నీరువాయి గ్రామానికి డ్రైనేజ్ కాలువ నిర్మాణానికి టీడీపీ నాయకులు భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ డ్రైనేజ్ కాలువలు, సిమెంట్ రోడ్లు మరెన్నో పనులకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సుప్రియ వెంకటేష్, నాయకులు ఢిల్లీ, అరుల్ ప్రకాష్, శరవణన్, కరివరదన్, హెడ్రి, నాగేంద్ర బాబు, ఏకాంబరం, ఆరుముగం, రుకేశ్, చిన్నదొరై, డేవిడ్, సంపత్ పాల్గొన్నారు.

18-20 తేదీల్లో జాతీయ సఫాయి కర్మచారి కమిషన్ పర్యటన

తిరుపతి టౌన్ : జాతీయ సఫాయి కర్మచారి కమిషన్ ఈనెల 18-20 తేదీల్లో తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో పర్యటించనుందని కలెక్టర్ వెంకటేశ్వర్ ఓ ప్రకటనలో తెలిపారు. తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో 'ది ప్రొహిబిషన్ ఆఫ్ ఎంపా ల్యమెంట్ యాజ్ మాన్యువల్ స్కావెంజర్ అండ్ రీహాబిలిటేషన్ యాక్ట్, 2013' అమలును సమీక్షించనున్నారు. 19న ఉదయం తిరుమల శ్రీవారిని బ్రేక్ దర్శనం చేసుకుంటారు. అనంతరం తుడాలో, రుయాలోనూ సమావేశం అవుతారు.

విద్యుత్ ఉప కేంద్రాన్ని సందర్శించిన ఎస్‌ఈ

ప్రజాశక్తి - యాదమరి: విద్యుత్ శాఖ ఉపకేంద్రాన్ని చిత్తూరు జిల్లా విద్యుత్ శాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్ ఇస్మాయిల్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలోని గాంధీ రోడ్డులోని విద్యుత్ ఉపకేంద్రాన్ని ఎస్‌ఈ, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ముని చంద్ర, డిప్యూటీ డివిజనల్ ఇంజనీర్‌తో కలిసి పరిశీలించారు. గత మూడు రోజులుగా వర్షాలు కురుస్తున్నందువలన విద్యుత్ సరఫరాలో ఎలటి అంతరాయం లేకుండా వినియోగదారులకు అందించాలని సిబ్బందికి సూచించారు.

వర్ష ప్రభావిత ప్రాంతాల పరిశీలన

కరుణ కాలనీలో పరిశీలిస్తున్న తహాశీల్దార్

ప్రజాశక్తి-రామచంద్రాపురం: గత మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు వరద ముంపు గురయ్యే ప్రాంతాలను తహాశీల్దార్ వెంకటరమణ పరిశీలించారు. బుధవారం మండలంలోని సి.రామాపురం పంచాయతీలోని కరుణ కాలని, రాయలచెరువు, బలిజపల్లి గ్రామాలను పర్యటించారు. గ్రామాలలో వర్షం వల్ల ప్రజలు ఇబ్బందులకు గురైతే పునరావాస కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఆర్ఐ క్రిష్ణమ్మ, వీఆర్వో ఝాన్సీ, పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

లక్ష్య సాధనపై దృష్టి పెట్టాలి

- డాక్టర్ ఉమామహేశ్వర రావు సూచన
- సెవెన్ హిల్స్ ఫార్మసీ కళాశాలలో ఘనంగా పట్టభద్రుల దినోత్సవం

గ్రాడ్యుయేషన్ పట్టాలను అందిస్తున్న ఉమా మహేశ్వరరావు

ప్రజాశక్తి-రామచంద్రాపురం: విద్యార్థులు విద్యాభ్యాస సమయంలోనే తమ లక్ష్యాల సాధన కోసం ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించి, ఉన్నత శిఖరాలను అధిరోహించాలని శ్రీ పద్మావతి మహిళ మెడికల్ కాలేజ్ విభాగాధిపతి డాక్టర్ ఉమామహేశ్వరరావు అన్నారు. బుధవారం మండలంలోని వెంకట్రామాపురంలో ఉన్న సెవెన్ హిల్స్ ఫార్మసీ కళాశాలలో పట్టభద్రుల దినోత్సవం ఘనంగా జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు యుక్త వయసులోనే మంచి ఆలోచన పరిజ్ఞానంతో ముందుకు సాగితే బంగారు భవిష్యత్తును పొందవచ్చు అన్నారు. విశిష్ట అతిథిగా హాజరైన శ్రీ వేద నారాయణ విద్యాసంస్థల అధినేత డాక్టర్ దినకర బాబు మాట్లాడుతూ నేటి సమాజం సాంకేతిక పరిజ్ఞానం వైపు నడుస్తుందని, ప్రతి ఒక్కరూ సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకొని మంచి భవిష్యత్తును నిర్మించుకోవాలన్నారు. సెవెన్ హిల్స్ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ నిరంజన్ బాబు మాట్లాడుతూ విద్యార్థులు విద్యతోపాటు నైతిక విలువలు, క్రమశిక్షణ అలవర్చుకుంటే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చున్నారు. అనంతరం వివిధ విభాగాలలో ప్రతిభ కనబరిచిన పట్టభద్రులకు గాడ్యుయేషన్ పట్టాలు, నగదు బహుమతులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ సుమలత, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేపై అసత్య ఆరోపణలు తగవు

సత్యవేడు నియోజకవర్గ టీడీపీ నేతలు

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

ప్రజాశక్తి-పిచ్చాటూరు: సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలంపై అసత్య ఆరోపణలు తగవు అని నియోజకవర్గ టీడీపీ నాయకులు తీవ్రంగా ఖండించారు. బుధవారం పిచ్చాటూరు టీడీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఎమ్మెల్యేపై వస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదని, ఎమ్మెల్యేకి వ్యతిరేక వర్గం దుష్ప్రచారాన్ని చేస్తున్నట్లు మండిపడ్డారు. ఎమ్మెల్యేపై సస్పెన్షన్ ఎత్తివేయాలని సీఎం చంద్రబాబు, నారా లోకేష్‌కు ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సెల్వ కుమార్, మాజీ ఎంపీపీ గోవిందస్వామి, మాజీ ఎంపిపి మణి, మాజీ ఎంపీపీ మురళి, టిడిపి సీనియర్ డాక్టర్ ఎడి శేషాద్రి, నాయకులు థామస్, సురేష్, నాగరాజ్, కంధస్వామి, సుగంధర్, మహేష్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

నష్టపోయిన వారిని ఆదుకోవాలి

సీపీఎం వినతి

తహాశీల్దార్‌కు విన్నవిస్తున్న సీపీఎం నాయకులు

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: తుపాను ప్రభావంతో నష్టపోయిన బాధితులను ఆదుకోవడానికి తక్షణమే చర్యలు చేపట్టాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం మండల తహాశీల్దార్‌కి సీపీఎం డివిజన్ నాయకులు వెంకటేష్ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో లోతట్టు ప్రాంతాల్లో నివాసముంటున్న ప్రజలకు బియ్యం, నిత్యావసరాలు పంపిణీ చేయాలని విజ్ఞప్తి చేశారు. నీట మునిగిన పంటలకు నష్ట పరిహారం అందించాలని నందిమంగళంలోని దళితవాడ వద్ద శ్మశాన వాటికకు దారి కల్పించాలని, కాలువకు బ్రిడ్జి ఏర్పాటు చేయాలని కోరారు. స్పందించిన తహాశీల్దార్ అందరికీ న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు విజయ్, రమేష్, శివ తదితరులు పాల్గొన్నారు.

వర్షంలోనూ శ్రీవారిమెట్టు వ్యాపారుల నిరసన దీక్ష

ప్రజాశక్తి -తిరుపతి టౌన్: శ్రీవారి మెట్టు వ్యాపారస్తులు తమ సమస్యలు పరిష్కరించాలని గత 57 రోజుల నుంచి టిటిడి పరిపాలనా భవనం వద్ద నిరసన దీక్ష చేస్తూనే ఉన్నారు. వర్షాలను సైతం లెక్కచేయకుండా 31 కుటుంబాల వారు దీక్షలు చేస్తుంటే కనీసం ఈవో స్పందించకపోవడం బాధాకరమన్నారు. టిటిడి స్పందించని పక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి ఎస్.జయచంద్ర, గంగులప్ప, శ్రీవారి మెట్టు వ్యాపారులు యుగంధర్, చిట్టిబాబు, మధు, చిరంజీవి, పెంచలయ్య, ప్రకాష్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి వార్తకు స్పందన

సమస్య పరిష్కారానికి చర్యలు

ప్రజాశక్తి- గంగాధర నెల్లూరు మురుగునీరు ఇలా... అరికట్టేది ఎలా...? అనే శీర్షికన ప్రజాశక్తి దినపత్రికలో సోమవారం ప్రచురితమైన వార్తకు స్పందన లభించింది. ఎంపిడిఓ హరిప్రసాద్ రెడ్డి బుధవారం మండలంలోని తూగుండ్రం గ్రామానికి వెళ్లి రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగునీటిని పరిశీలించారు. మురుగు రోడ్డుపైకి రాకుండా కాలువలు ఏర్పాటు చేయిస్తామని తెలిపారు. ఈ విషయమై పై అధికారులతో చర్చించి వెంటనే సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి మురళి, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు యువరాజ్, బోస్, ఫీల్డ్ అసిస్టెంట్ కర్ణ ఉన్నారు.

మురికి నీరు ప్రవహిస్తున్న వీధిని ఎరిశీలిస్తున్న ఎంపీడీవో

రోడ్లు ఇలా.. ప్రయాణం ఎలా..?

- ప్రభుత్వాలు మారినా.. మారని రోడ్ల స్థితి..
- అధ్వానంగా అంతర్‌రాష్ట్ర రహదారి
- 10 కిలోమీటర్ల మేర ఇదే పరిస్థితి
- ప్రయాణికులకు తప్పని ఇక్కట్లు
- నిద్రావస్థలో అధికారులు

ప్రభుత్వాలు మారుతున్న ... మండలంలో రోడ్డు పరిస్థితి మాత్రం ఏ మాత్రం మారడం లేదు.. గుడియాత్తం-చిత్తూరు అంతర్రాష్ట్ర రహదారి... యాదమరి మండల కేంద్రం జోడి చింతల నుండి తమిళనాడు సరిహద్దు కనికాపురం వరకు రోడ్డు మరమ్మతులు చేపట్టకపోవడంతో అధ్వానంగా తయారయ్యింది. పది కిలోమీటర్ల మేర అడుగుకో గుంత.. వాహనచోదకులు ఈ దారి గుండా ప్రయాణించాలంటే బెంబేలెత్తిపోతున్నారు. ముందుకు సాగలేక వెనుక్కు రాలేక నానా అవస్థలు పడుతున్నారు.

జోడి చింతల వద్ద అధ్వానంగా రోడ్డు

ప్రజాశక్తి- యాదమరి: గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు చిత్తూరు -గుడియాత్తం అంతర్రాష్ట్ర రహదారి చెరువును తలపిస్తోంది. జోడిచింతల వద్దనున్న పోలీస్‌స్టేషన్ నుంచి తమిళనాడు సరిహద్దు కనికాపురం వరకు అడుగుకో గుంత ఉండటంతో ఈ దారిలో ప్రయాణించాలంటే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీనికి తోడు ఈగుంతల్లో వర్షపు నీరు నిండి ఉండడంతో వాహనదారులు తరచూ ప్రమాదాల భారిన పడుతున్నారు. ఇక రాత్రి సమయాల్లో అయితే వారి దుస్థితి చెప్పనక్కర్లేదు. ప్రతిరోజు వాహనదారులు ఈ దారిలో ప్రయాణించేటప్పుడు తమ ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకుని ప్రయాణించాల్సిన పరిస్థితి నెలకొన్నది. రోడ్డు మరమ్మతులు చేపట్టకపోవడంతో ఈరహదారి గుండా నిత్యం వాహనచోదకులు ప్రమాదాల భారినపడి హాస్పిటల్ పాలవుతున్నారు. మరి కొంతమంది ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. నిత్యం ప్రయాణిస్తున్న వాహనాలు ఆ రోడ్లలో గుంతల్లో చిక్కుకుని ముందుకు వెనక్కి సాగలేక వాహనాలు మొరాయిస్తున్నాయి. ఏళ్లతరబడి ప్రజలు ఇంత ఇబ్బంది పడుతున్నా అటు ప్రజాప్రతినిధులు, సంబంధిత శాఖ అధికారులు ప్రేక్షకపాత్ర వహిస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ రోడ్డు ఇంత అధ్వానంగా తయారైందని పలుమార్లు ప్రతికల్లో ప్రచురితమైనా.. పలువురు నిరసనలు తెలిపినా ఇప్పటికీ ఎటువంటి ప్రయోజనం లేదు.. ఇక ఈరోడ్డును ఎప్పటికీ మరమ్మతులు చేపడతారని వేచి చూడాల్సిందే..

చిత్తూరు- బెంగళూరు అంతర్రాష్ట్ర రోడ్డుపై నీరు నిలిచి ఉన్న దృశ్యం

కసిరాల కొత్తూరు వద్ద భారీ గోతుల్లో రోడ్లపై నీరు నిలిచిన దృశ్యం

'భారతీయ సంస్కృతికి ఆధారం వైఖానసాగమం'

కార్యశాలకు హాజరైన ప్రముఖులు

ప్రజాశక్తి-క్యాంపస్: జాతీయ సంస్కృత విశ్వవి ద్యాలయం తిరుపతిలో ఆగమ విభాగం ద్వారా "వైఖానసాగమోక్త అర్చనం" అనే అంశంపైన తొమ్మిది రోజుల జాతీయ కార్యశాల విశ్వవిద్యాలయంలోని ప్రముఖ చెలికాని అన్నారావు సభాభవనంలో బుధవారం ప్రారంభించారు. ముఖ్య అతిథులుగా మైసూర్ మహారాజ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పి.సత్యనారాయణ, విశ్వవిద్యాలయం ఉప కులపతి ఆచార్య జిఎస్ఆర్ కృష్ణమూర్తి హాజరయ్యారు. ప్రొఫెసర్ పి.సత్యనారాయణ మాట్లాడుతూ భారతీయ సంస్కృతికి ఆధారభూతమైనది వైఖానసాగమని, వైఖానసాగమోక్త అర్చనావిధానం లోకక్షేమానికి ప్రధాన కారణంభూతనమైనదని, ఆలయ నిర్మాణం నుంచే ప్రాయశ్చిత్తాల వరకు వేదమంత్రాలతో నిబిడీకృతమైనదన్నారు. విసి ఆచార్య జిఎస్... కృష్ణమూర్తి మాట్లాడుతూ తిరుమల శ్రీవారికి అర్చనలు వైఖానసాగంలో చెప్పిన విధంగా నిర్వహించబడుతున్నాయని, వాటిని పరిశీలిస్తే చతుర్దశ భువనాలకు అధిపతియగు శ్రీనివాసునికి ప్రతిదినం 14 పర్యాయాలు, ప్రకారాంతరంగా ఆరాధన జరపటం విశేషమని అన్నారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయం అకడమిక్ డీన్ ప్రొఫెసర్ ... నస ఆగమ ప్రముఖులు శ్రీమాన్ దీవి రాఘవదీక్షితులు, అర్చకం వెంకటరమణ, ఎవి రమణాచార్యులు, దర్శన డీన్, జాతీయ కార్యశాల కోఆర్డినేటర్ ప్రొఫెసర్ విష్ణు భట్టాచార్యులు, ఆగమ విభాగ సహాయకాచార్యులు, కార్యశాల సహసంయోజకులు డాక్టర్ పిటిజి రంగ రామానుజాచార్యులు, అధ్యాపకులు, విద్యార్థులు, పరిశోధకులు పాల్గొన్నారు.

నీవా నది చుట్టూ ప్రహరీ గోడ నిర్మించాలి

ప్రజలకు రక్షణ కల్పించాలి: సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: చిత్తూరు నడిబొడ్డున ఉన్న నీవానది చుట్టూ వేలాది మంది ప్రజల నివసిస్తున్నారని, గతంలో వరదల కారణంగా వేలాది మంది నష్టపోయినరని భవిష్యత్తులో అలాంటి పరిస్థితి లేకుండా ప్రహరీ గోడ నిర్మించి ప్రజలకు రక్షణ కల్పించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు డిమాండ్ చేశారు. వెంటనే ప్రహరీ గోడ నిర్మించాలని బుధవారం సిపిఎం ఆధ్వర్యంలో నీవానది వద్ద నిరసన వ్యక్తం చేయడం జరిగింది. ఈ సందర్భంగా వాడ గంగరాజు, జిల్లా నాయకులు కె.సురేంద్రన్ మాట్లాడుతూ అధికారులు, ప్రభుత్వం సమస్య వచ్చినప్పుడే కాకుండా భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని నీవానది చుట్టూ ప్రహరీ గోడ ఏర్పాటు చేసి ప్రజలకు రక్షణ కల్పించే విధంగా శాశ్వత పరిష్కారం కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం తుపాను వలన ఎప్పుడు వరద వస్తుందోనని ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. అదేవిధంగా దుర్వాసనతో రకరకాలు వ్యాధులతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. బయట ప్రాంతాల్లో వర్షాలు భారీగా పడితే నీవా నది తీవ్రస్థాయిలో ప్రవహిస్తుందని, చెత్తచెదారం బ్రిడ్జి వద్ద పేరుకుపోతుందని అప్పుడు స్థానికంగా నివాసం ఉంటున్న ప్రజలు ఇబ్బందులు పడాల్సి వస్తుందని తెలిపారు. కార్పొరేషన్ అధికారులు తూతూ మంత్రంగా బ్రిడ్జ్ దగ్గర మాత్రమే క్లీన్ చేశారని అలా కాకుండా కాలువ మొత్తం పూడికతీత తీయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా జిల్లా కేంద్రంలోని చిత్తూరు నగరంలో ఎలాంటి నష్టపరిహారం జరగకుండా కలెక్టర్ ఇతర అధికారులు చొరవ తీసుకోవాలని కోరారు.

మహారాజశ్రీ గూడూరు సీనియర్ సివిల్ జడ్జివారి కోర్టులో
S.O.P. No.108/2024
1. Guntakovela @ Guntakuvvala Rajamma
2. Guntakovela @ Guntakuvvala Murali
3. Gimtakovela @ Guntakuvvala Muni Raja
4. Tankasala Deepa ... Petitioners
Vs.
Nil ...Respondent
జనరల్ నోటీసు
ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయడమైమనగా పై నెంబరు పిటిషనులో 1వ పిటిషనరుకు భర్త మరియు 2,4 పిటిషనర్లుకు తండ్రి అయిన జి.మునెయ్య ఆచారికి తేది 23.11.2020న జోరేపల్లి శ్రీనయ్య వ్రాసి ఇచ్చిన రెండు ప్రామిసరి నోట్లకు సంబంధించి వెంకటగిరి జూనియర్ సివిల్ జడ్జివారి కోర్టులో పిటిషనర్లు దావా దాఖలు చేసినందున పై కోర్టులో సక్సెషన్ సర్టిఫికేట్ దాఖలు చేయుటకు పిటిషనర్లు పై కోర్టులో పిటిషన్ పెట్టినందున ఎవరికైనా ఆక్షేపణలు వున్న యెడల తేది 21.10.2024న పై వారి కోర్టులో ఉదయం గం॥ 10:30ని॥లకు హాజరై ఆక్షేపణలు తెలుపుకోవలసినది.
ఇట్లు
P.GOPAL REDDY
P. NARENDRA
పిటిషనర్ల తరపు న్యాయవాదులు
గూడూరు.